క్లుప్తంగా

బాలికల భవితకు 'సుకన్య సమృద్ధి'



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: తపాలా శాఖ అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి పథకం బాలికల భవితకు బంగారు బాటలు వేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. ఈ పథకం ప్రయోజనాలు వివరిస్తూ గురువారం స్థానిక 30వ వార్డు సంగంపుంత కాలనీలో మండపేట పోస్టుమాస్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్ల లోపు బాలికలకు ఈ పథకం గొప్ప వరమని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రామచంద్రపురం పోస్టల్ ఎస్‌ఐ ఎం.లక్ష్మణకుమార్ మాట్లాడుతూ పదేళ్ల లోపు బాలికలకు కేవలం రూ.250 చెల్లించి అకౌంట్ ఓపెన్ చేసుకోవచ్చన్నారు. ప్రస్తుత వడ్డీరేటు 7.6 శాతం కాగా దీనిలో పొదుపు చేసిన సొమ్ముపై చక్రవడ్డీ వస్తుందని వివరించారు. కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, పోస్టల్ అసిస్టెంట్ కొండపల్లి సూర్యనారాయణ, సీనియర్ ఉద్యోగి ఎండీఎం షరీఫ్, సుందరపల్లి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆన్‌లైన్ ద్వారా ప్రజలు ఎక్కువగా వస్తువులు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీనిని ఆసరాగా తీసుకుని నేరగాళ్లు మనం ఆర్డర్ పెట్టని వస్తువులు ఇంటికి తీసుకువచ్చి, మనది కాదని చెప్పగానే ఆర్డర్ కేన్సిల్ చేస్తున్నామని మీ ఫోన్‌కి ఓటీపీ నంబరు వస్తుందని చెప్పమని అడుగుతున్నారన్నారు. సెల్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పగానే మన బ్యాంక్ ఖాతాలలో సొమ్ము మాయమవుతుందన్నారు. ఏ సమయంలోనైనా సెల్ ఫోన్‌లకు వచ్చే ఓటీపీ నంబర్లు బయటకు చెప్పే విషయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కె.గంగవరం: యండగండి గ్రామానికి చెందిన వలంటీర్ రాంబాబు, సుందరపల్లిలో ఇటుక ట్రాక్టర్ బోల్తా పడి ప్రసాద్ మృతి చెందారు. బాధిత కుటుంబాలను జనసేన నియోజకవర్గ నాయకుడు పోలిశెట్టి చంద్రశేఖర్ పరామర్శించి, పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ తరఫున నిత్యావసరాలు అందజేశారు.

పారదర్శకంగా సర్వే రాళ్ల ఏర్పాటు



అముజూరులో సర్వే రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ

కె.గంగవరం: జగనన్న భూరక్ష పథకంలో భాగంగా భూ రీసర్వే పనులను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ ఆదేశించారు. మండలంలోని పాణింగపల్లి, అముజూరు గ్రామాల్లో సరిహద్దు సర్వే రాళ్ల ఏర్పాటు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలకు సర్వే రాళ్లు వచ్చాయన్నారు. వీటిని ఆయా గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది నిబంధనల ప్రకారం సూచించిన చోట ఏర్పాటు చేస్తారని చెప్పారు. వీఆర్వో పట్టాభి రామారావు, గ్రామ పెద్దలు నానాపరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది

మండపేట: గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి అన్నారు. కేశవరం దేవుడుతాళ్ల కాలనీలోని 281 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకుని పండంటి బిడ్డలకు జన్మనివ్వాలన్నారు. అనంతరం పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు, జాకెట్లు తదితర సామగ్రి అందజేశారు. ఏఎన్‌ఎంలు అనంత, ఆశా, పి.శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరపడండి.. ఆఖరి అవకాశమిదే..

- ఈకేవైసీకి రేపటితో ముగియనున్న గడువు
- ఇప్పటికే 95 శాతం పూర్తి
- క్లస్టర్‌లో 1.02 లక్షల ఎకరాల్లో సాగు



పసలపూడిలో రైతులకు ఈకేవైసీ చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రాయవరం: నేల తల్లిని నమ్ముకున్న రైతన్నకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.. వ్యవసాయాన్ని పండగలా మార్చింది.. పథకాల అందజేతలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పక్కా చర్యలు తీసుకుంటోంది. ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వ గిట్టుబాటు ధర లభించాలన్నా.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పరిహారం పొందాలన్నా.. పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నా ఈ–పంట నమోదు తప్పనిసరి. అంతేకాదు ఈ–పంట నమోదు చేసుకున్న రైతులంతా ఆధార్‌తో అనుసంధానం చేసే ఈకేవైసీ ప్రక్రియను కూడా పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే పలు దఫాలుగా అవకాశాలిచ్చిన ప్రభుత్వం ఈ నెల 4వ తేదీతో ఈకేవైసీ నమోదుకు తుది గడువును విధించింది. రైతుల ప్రయోజనం కోసం చేపడుతున్న చర్యలతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ–క్రాప్‌లో పంట నమోదు చేయించుకోవడం ఎంత ముఖ్యమో, రైతులు ఆధార్ అనుసంధానం చేయించుకోవడం కూడా అంతే అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈకేవైసీకి త్వరపడాలని సూచిస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల్లో 1.02 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ 53,710 మంది రైతులకు 48,457 మంది 90,982.13 ఎకరాల్లో 95 శాతం మేరకు ఈకేవైసీని పూర్తి చేయించుకున్నారు. మిగిలిన రైతులు కూడా ఈ నెల నాలుగో తేదీలోగా పూర్తి చేయించుకోవాల్సి ఉంది.

ప్రయోజనాలు ఎన్నో..

ఈ–క్రాప్‌లో రైతులు పంట నమోదు చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. పెట్టుబడి సాయం అందించడం, పంటకు బీమా, నష్ట పరిహారం చెల్లించడం, పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, సాగుకు అవసరమయ్యే ఎరువులు, పురుగు మందులు అందించడం ఇలా అన్నీ ఈ–క్రాప్ నమోదుతో సులభతరం అవుతాయి. ఈ కర్షక్ యాప్‌లో ప్రతి రైతు వివరాలు నమోదు చేస్తున్నారు. నూతన విధానంలో మొదట ఆర్‌బీకేల్లో రైతుల వివరాల నమోదు, అనంతరం క్షేత్ర స్థాయిలో పంట నమోదు, చివరగా ప్రతి రైతు ఈకేవైసీ చేయాల్సి ఉంది. దీనివల్ల పంట అమ్ముకునే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పుతుంది. ప్రతి రైతు ఈకేవైసీకి త్వరపడాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

వరి సాగు నమోదు ఇలా..

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈకేవైసీ పూర్తి (ఎకరాల్లో)
మండపేట	17,222.5	15141.99
కపిలేశ్వరపురం	16,156	15241.94
రాయవరం	14,825	13843.07
రామచంద్రపురం	19,007.5	17379.69
కె.గంగవరం	15,882.5	14687.72

సద్వినియోగం చేసుకోవాలి



ఈకేవైసీ చేయించుకోకుంటే ఈ–పంట నమోదు చేయించుకున్నప్పటికీ ప్రయోజనాలు పొందలేరు. రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది ఈకేవైసీని పూర్తి చేస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలు పొందాలి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

దంత సమస్యలను అశ్రద్ధ చేయొద్దు



చిన్నారులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదపూడి: దంత సమస్యలను అశ్రద్ధ చేయరాదని కాకినాడ శ్రీసూర్యచంద్ర దంత ఆసుపత్రి వైద్యులు సలాది సూర్యకమల, జేసీఐ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రవితేజ అన్నారు. రామేశ్వరం గ్రామంలో గురువారం శ్రీసూర్యచంద్ర దంత ఆసుపత్రి, జేసీఐ ఆర్గనైజేషన్ సంయుక్తంగా ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 90 మందికి దంత వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యుడు శివ, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: కాపవరం గ్రామంలో తన అత్తయ్యకు ఐదు సెంట్ల భూమి ఉందని వీధి సోలోమన్‌రాజు పేర్కొన్నారు. ఆ భూమిలో అదే గ్రామానికి చెందిన పలివెల జార్జి, కొమనాపల్లి అర్జమ్మ, పలివెల పండు, పలివెల భారతీరాజాలు రేకుల షెడ్డు వేసేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డుకున్నందుకు తనపై దాడి చేసి గాయపరిచారని సోలోమన్‌రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఏఎస్సై ఎస్.పాపారావు గురువారం తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ



విద్యార్థి చైతన్యను అభినందిస్తున్న హెచ్‌ఎం రమణ, ఉపాధ్యాయులు

అనపర్తి: రాష్ట్ర స్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో పీరారామచంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి ముప్పిడి చైతన్య ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం వి.రమణ తెలిపారు. గత నెల 27 నుంచి మార్చి 1వ తేదీ వరకూ చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన చైతన్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్రీడాకారుల్లో 3వ స్థానంలో నిలిచారన్నారు. గురువారం పాఠశాలలో ఆ విద్యార్థికి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీ జి.దేవి రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు శంకరస్వామి కల్యాణోత్సవం

రామచంద్రపురం రూరల్: నరసాపురపుపేటలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత భవానీ శంకరస్వామి దివ్య కల్యాణం శుక్రవారం రాత్రి 8 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠాపన, రుద్రహోమం, సాయంత్రం గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. 4న నిత్య పూజలు, 5న సాయంత్రం గ్రామోత్సవం, సదస్యం, 6న నిత్య పూజలు, నీరాజన మంత్ర పుష్పం, 7న నాకబలి, త్రిశూల స్నానం, చోరోత్సవం, శ్రీపుష్పోత్సవం, 8న అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

భీమేశ్వరస్వామికి పూజలు

ద్రాక్షారామలోని మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయాన్ని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి గురువారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. హసన్‌బాద, ఆదివారపుపేట, అద్దంపల్లి చేనేత సహకార సంఘ చైర్మన్లు దొంతంశెట్టి సత్యప్రకాష్, ఉప్పు అర్ధనారీశ్వర బులిరాజు, శలా పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణపై అవగాహన



అంగర శ్రీసిద్ధార్థ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం: ఆడపిల్లను రక్షించు– ఆడపిల్లను చదివించు నినాదంతో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో విద్యార్థులకు గురువారం వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పలు అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం చట్ట రీత్యా నేరమని, విద్యార్థినులు చదువుకోవడం ద్వారా సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపీహెచ్‌ఎస్ పి.సురేష్, టి.మేరీ మణి, ఆరోగ్య కార్యకర్త వెన్నేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు

తాళ్లరేవు: నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన వారమవుతామని సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ అన్నారు. గురువారం పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామానికి చెందిన రేషన్ డీలర్ యడ్ల మునలయ్య(90) మృతి చెందారు. ఈ నేపథ్యంలో మునలయ్య కుటుంబసభ్యులతో మాట్లాడి అతని కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ.బ్యాంకు వారికి అందజేశారు. ఐ బ్యాంకు టెక్నీషియన్ రవి కార్నియాలను సేకరించారు. అంతటి విషాద సమయంలోనూ నేత్రదానం చేసేందుకు అంగీకరించిన కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేయాలి



గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పి.గన్నవరం: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పని చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వై.కొత్తపల్లి, ఆర్.ఏనుగుపల్లి, పి.గన్నవరం, ఎల్.గన్నవరం గ్రామాల్లో జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు అధ్యక్షతన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ, ఈ నెల 18 నుంచి జరగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గృహసారథులకు కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, దొమ్మేటి పార్వతి, టీవీవీ సత్యనారాయణ, ఎస్.ప్రసన్నకుమార్, సొసైటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్, ఎంపీటీసీ సభ్యులు కొల్లే సూర్యనారాయణ, దాసరి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓపై కేసు

అయినవిల్లి: తొత్తరమూడి గ్రామ సచివాలయం–1 వీఆర్‌ఓ పసుపులేటి సత్యధనలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత నెల 25న సచివాలయంలో జలజీవన్ మిషన్ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా ఓ స్థలం విషయమై వీఆర్‌ఓను ఉప సర్పంచ్ బొంతు శ్రీను, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు ప్రశ్నించారు. దీనికి వివరణ ఇవ్వకపోగా ఆమె తమను నానా దుర్భాషలూ ఆడిందని, రెవెన్యూ సంఘంలో పెట్టి తమ అంతు చూస్తామంటూ బెదిరించారని ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి మరింత కృషి



గొల్లపాలెంలో మాట్లాడుతున్న పెట్టా శ్రీనివాస్, పంపన సుబ్బారావు

కాజులూరు: వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసే దిశగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మండల గృహ సారథుల కమిటీ పరిశీలకుడు పంపన సుబ్బారావు అన్నారు. గురువారం మండలంలో వారు పర్యటించి కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లతో సమావేశాలు ఏర్పాటు చేశారు. గొల్లపాలెం గ్రామ సచివాలయంలో శ్రీనివాస్, సుబ్బారావు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగలేదన్నారు. సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు, వలంటీర్లతో సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు జొన్నకూటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, సచివాలయ కన్వీనర్లు పితాని శివ, మాత బోస్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివార్లకు పూజలు చేస్తున్న వేద పండితులు

మండపేట: స్థానిక రథం గుడిలో వేంచేసి ఉన్న అగస్త్యేశ్వర కైలాసేశ్వర, సర్వేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా ఆలయ అర్చకుడు అయినవల్లి సూర్యసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామివార్ల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేశారు. వేదపండితుడు యలమంచిలి కృష్ణమూర్తి, ఆలయ ఈఓ పీవీవీఎస్ కామేశ్వరరావు, సిబ్బంది ఎం.సూరిబాబు, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలు ప్రారంభం

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కట్టా రామచంద్రరావు, సభ్యుల పర్యవేక్షణలో పూజలు చేశారు. వాడపల్లి శ్రీలక్ష్మీ హయగ్రీవాచార్యులు, సంపర లక్ష్మీనరసింహ భాస్కర శ్రీనివాసాచార్యులు అర్చక పర్యవేక్షణలో దేవతామూర్తులకు పంచామృత స్నపనం, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేశారు.

ఎండ సుర్రుమంటోంది..

- ముదురుతున్న వేసవి
- కూలర్లు, ఏసీలతో పెరిగిన విద్యుత్ వినియోగం



మండపేటలోని ఓ గృహోపకరణాల దుకాణంలో ఏసీలు



మండపేట- రామచంద్రపురం రోడ్డులో వెలసిన జ్యూస్ దుకాణాలు

మండపేట: ఎండ మండిస్తోంది.. రోజురోజుకూ గుబులు పుట్టిస్తోంది.. పగటి ఉష్ణోగ్రత 37 డిగ్రీలకు పైబడి నమోదవుతోంది. ఉక్కబోతకు తాళలేక ప్రజలు ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తుండటంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. మరోపక్క రోడ్ల వెంబడి గ్రీష్మతాపం నుంచి ఉపశమనం కలిగించే పండ్ల రసాలు, పుచ్చకాయల దుకాణాలు వెలుస్తున్నాయి. పది రోజుల వ్యవధిలో పగటి ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగాయి. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో రెండు రోజుల నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముమ్ముందు ఇవి మరింత పెరగనున్నాయి. మండపేట సబ్ డివిజన్ పరిధిలో రోజుకు విద్యుత్తు సాధారణ వినియోగం 70 లక్షల యూనిట్లు కాగా కొద్ది రోజులుగా క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం 90 లక్షల యూనిట్లకు చేరిందని ఆ శాఖ అధికారులు తెలిపారు. రానున్న రెండు నెలల్లో ఎండల తీవ్రతను బట్టి ఈ వినియోగం 1.2 నుంచి 1.4 మిలియన్ యూనిట్ల వరకూ పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. విద్యుత్ కోతలు రాకుండా అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే షాపుల్లో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, కూలర్లు, ఫ్యాన్ల విక్రయాలు పెరిగాయి. వీటి అమ్మకాలకు అనుగుణంగా వ్యాపారులు స్టాకులు తెచ్చిపెట్టుకుంటున్నారు. పది రోజులతో పోలిస్తే 10 నుంచి 15 శాతం మేర అమ్మకాలు పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

పుచ్చకాయలు.. పండ్ల రసాలు

రోడ్ల వెంబడి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించే పండ్లు, చెరుకు రసాలు, సీజనల్‌గా వచ్చే పుచ్చకాయలు, రామాఫలాల దుకాణాలు వెలుస్తున్నాయి. మండపేట– రామచంద్రపురం రోడ్డు, రామచంద్రపురం– ద్రాక్షారామ రోడ్డు, ద్వారపూడి–కేశవరం రోడ్డు, కోటిపల్లి–గొల్లపాలెం రోడ్లలో చెట్ల నీడలో వ్యాపారులు వీటిని విక్రయిస్తున్నారు. దారిన వెళ్లే ప్రయాణికులు వీటి వద్ద ఆగి సేదదీరుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో బయట తిరిగేవారు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. తలనొప్పి, తీవ్ర జ్వరం, మగత నిద్ర, లేదా కలవరింపులు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితి ఉంటే వడదెబ్బ లక్షణాలుగా గుర్తించి వెంటనే ప్రాథమిక చికిత్స అందించాలని సూచిస్తున్నారు. చల్లని ప్రదేశానికి చేర్చి, చల్లని వస్త్రంతో శరీరాన్ని తుడవడంతో పాటు చల్లని గాలి తగిలే విధంగా చూడాలంటున్నారు. వైద్య సాయం కోసం దగ్గర్లోని ఆస్పత్రికి తరలించాలి. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు వేసవిలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలో బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన



ఓటర్ల జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

రాయవరం: సోమేశ్వరం గ్రామ ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యాలయం, రాయవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ప్రదర్శించారు. సోమేశ్వరం–2 ఎంపీటీసీ పదవికి ఎన్నికల ప్రక్రియను నిర్వహించనున్నారు. జిల్లా పంచాయతీ అధికారి ధ్రువీకరించిన ఓటర్ల జాబితాను మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఎంపీడీవో డి.శ్రీనివాస్, పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి శ్రీనివాసరావు ప్రదర్శించారు. ఈ పంచాయతీ పరిధిలో మొత్తం 6,865 మంది ఓటర్లు ఉండగా, ఎంపీటీసీ–2 పరిధిలో 8 నుంచి 14 వార్డులకు గాను 3,435 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో వివరించారు.